క్లుప్తంగా

గంజాయి విక్రేతల అరెస్ట్



పటమట(విజయవాడతూర్పు): గుట్టు చప్పుడు కాకుండా కాలేజీ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్న గ్యాంగ్‌ను పటమట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎనికేపాడు సెక్టార్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... గూడవల్లికి చెందిన కొడాలి రాకేష్, ఇందుపల్లి దినేష్, ఉయ్యూరు రాజశేఖర్ ఈ నెల 23వ తేదీన విశాఖజిల్లా యలమంచిలి నుంచి నాలుగు కేజీల గంజాయి తీసుకొచ్చారు. యలమంచిలి నుంచి తెచ్చిన గంజాయిని కొడాలి రాకేష్ వాళ్ల బంధువులు ఇంట్లో దాచారు. దీనిపై సమగ్ర సమాచారం రావటంతో పోలీసు బృందం దాడిచేసి నిందితులను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టుకు హాజరుపర్చారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తిరువూరు: కుటుంబ కలహాలతో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరువూరు మినీ స్టేడియం సమీపంలో ఉన్న మామిడి తోటలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల మేరకు... ఖమ్మం జిల్లా వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన బత్తుల మారేష్‌కు (30) తిరువూరుకు చెందిన నాగమణితో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసైన మారేష్ కుటుంబ బాధ్యతలు విస్మరించడంతో భార్యా పిల్లలు ఆయనకు దూరంగా ఉంటున్నారు. భార్య పుట్టింటిలో ఉంటున్న కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

కార్తిక శోభతో ఆలయాలు కళకళ



పామర్రు శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



దీపారాధన చేస్తున్న భక్తులు

పామర్రు: కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని ఆలయాలు కార్తిక శోభతో కళ కళలాడాయి. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు కోలాహలంగా పూజలు చేశారు. స్థానిక పుల్లేరు కాలువలో తెల్లవారుజామున స్నానాలను ఆచరించి అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి దీపపు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని సోమే శ్వరస్వామి వారికి విశేషంగా ఏకాదశ రుద్రాభిషేకాలను నమక చమకాలతో అభిషేకాలను నిర్వహించామని ఆలయ అధికారి కె.వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక అంకమ్మ తల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి విశేషంగా అభిషేకాలను నిర్వహించామని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోటిపాండురంగారావు, వరదా అప్పారావు తెలిపారు. స్థానిక విష్ణాలయంలో భక్తులు విశేషంగా దీపాలను వెలిగించి పూజలుచేశారు.

గుడివాడరూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో కార్తికమాసం సందర్భంగా శివాలయాలు భక్తులతో సోమవారం తెల్లవారు జాము నుంచే కిటకిటలాడాయి. మండలంలోని మోటూరు, దొండపాడు, చౌటపల్లి, రామనపూడి, బొమ్ములూరు, గుంటాకోడూరు, పర్నాస తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తుల తెల్లవారు జాము నుంచే విచ్చేసి విశేష పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

గుడివాడ టౌన్: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. వేకువ జామున 3 గంటల నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ పదక్షిణ నిర్వహించి దీపారాధనలు కొనసాగించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం (పెద్ద శివాలయం), గౌరీశంకరపురంలో గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్నశివాలయం), బేతవోలులోని ఆనందేశ్వరస్వామి దేవస్థానం లలో కార్తిక పూజలు చేశారు.

రేపు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 17వ జాతీయ కాన్ఫరెన్స్

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో ఈ నెల 29, 30 తేదీల్లో శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం, జాతీయ మహిళా పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల నేతృత్వంలో 17వ జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణ కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు పద్మశ్రీ డాక్టర్ సోసమ్మ, గోపాలకృష్ణ ద్వివేది, యస్.వి.వియు ఇన్‌చార్జ్ ఉప కులపతి ఉమేష్‌చంద్రశర్మ, ఏపీ, పాండిచ్చేరి డైరెక్టర్లు అమరేంద్ర కుమార్, లతామంగేష్కర్, డీన్‌లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. చివరి రోజు ముఖ్య అతిథిగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, పశువైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యకుమారి పాల్గొంటారని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌కు దేశ నలుమూలల నుంచి మహిళా పశు వైద్యులు, వారు చేసిన పరిశోధనలను విపులంగా తెలియజేస్తారని పేర్కొన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో పశువైద్య రంగంలో గణనీయ సేవలను అందించిన వారికి జీవిత సాఫల్య పురస్కారం, ఆంధ్ర రాష్ట్ర ఉత్తమ మహిళా పశువైద్య పురస్కారం అందజేస్తారన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉయ్యూరు: పుల్లేటి కాలువలో గుర్తు తెలియని శవం లభ్యమైంది. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉయ్యూరులోని బస్టాండు సమీపంలో పుల్లేటి కాలువలో గుర్తు తెలియని శవం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసారు. పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, బులుగు రంగు ప్యాంటు, నలుపు రంగు బెల్టు ధరించి, ఐదు అడుగులు ఎత్తు కలిగి ఉన్నాడని ఎస్ఐ వాసు తెలిపారు.

57 మందికి ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు పారితోషికాలు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన అడ్సుమిల్లి అశ్వర్థనారా యణమూర్తి 118వ జయంతి సోమవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో 156 మంది వృద్ధులకు వస్త్రాలు, 57 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుడ్లవల్లేరు పాలిటెక్నికల్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడిగా విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వక్తలు అన్నారు. ట్రస్టీలు కేవీ కృష్ణారావు, వి.సుబ్బారావు, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, వి.రామకృష్ణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, ఈఓ ఎస్ఎస్ఎస్‌వీ రామాంజనేయులు పాల్గొన్నారు.

రెండో విడత గృహప్రవేశాలకు సిద్ధంకండి



మాట్లాడుతున్న అధికారులు

గుడివాడ టౌన్: పట్టణం, నియోజకవర్గ పరిధిలోని జగనన్న కాలనీలో రెండో విడత గృహప్రవేశాలు ఫిబ్రవరి మొదటి వారానికి పూర్తి కావాలని హౌసింగ్ డీఈ రామోజీ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుంచి వచ్చే ఏడాది జనవరి 31 నాటికి 60 రోజుల్లో వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. ఇందుకు వలంటీర్లు ప్లానింగ్ సెక్రటరీలు గ్రామాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండలస్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించి బేస్, రూఫ్, లెవల్స్ పూర్తిచేసే కార్యక్రమం ముమ్మరం చేయాలన్నారు. అందుకు కావలసిన నిర్మాణ సామగ్రి వెంటనే సరఫరా చేస్తామని, దీనికి తోడు ఆర్థిక ప్రణాళ/ కను రూపొందిస్తున్నామన్నారు. ద్వాక్రా గ్రూపులో ఉన్న లబ్ధిదారులకు మరొక పర్యాయం రుణం ఇచ్చేందుకు పురపాలక సంఘం ఆమోదం తెలుపుతుందన్నారు. వెంటనే మిగిలిఉన్న నిర్మాణపు పనులను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులను, లబ్ధిదారులను కోరారు.

భక్తి పారవశ్యంలో ముంచెత్తిన గాత్ర కచేరీ



గాత్ర కచేరిలో పాల్గొన్న సంగీత విద్వాంసులు

మొవ్వ: మహాకవి క్షేత్రయ్య జన్మస్థలమైన మొవ్వ మండలం కూచిపూడిలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణు గోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన కర్నాటక సంగీత విద్వాంసులు, కళారత్న మల్లాది సూరిబాబు గాత్ర కచేరి పండిత పామరులను సైతం పరవశింపచేసింది. కేంద్ర పర్యాటక శాఖ సారథ్యంలో డిసెంబర్ 10,11,12 తేదీల్లో విజయవాడలో జరగనున్న కృష్ణవేణి సంగీత నాట్య నీరాజనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముందస్తుగా మొవ్వలో నిర్వహించిన ఈ గాత్ర కచేరీ సుమారు గంటన్నరపాటు రసవత్తరంగా సాగింది. విజయవాడకు చెందిన సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, బెంగుళూరుకు చెందిన ఎస్సార్ వినయ్ సహకార గాత్రంతో ఆలపించిన కృతులు ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. వీనికి వయోలిన్‌పై కే దినకర్, మృదంగంపై కే యోగేష్‌లు సహకరించి కార్యక్రమాలకు జీవం పోశారు. టూరిజం జిల్లా శాఖాధికారి అరుణ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే సురేష్, కేంద్ర పర్యాటక శాఖఅధికారి దీపక్ జోషి, సంగీత నాట్య ఆకాడమీ అధికార సేనాపతి రబి, ఘంటసాల వెంకటేశ్వరరావు మిర్చి సంగీత కళాశాల ప్రాధానా చార్యులు కృష్ణవేణి, పర్యాటక శాఖ మేనేజర్ రామ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంఈవో శేఖర్‌సింగ్

గుడివాడరూరల్: ప్రభుత్వం సెలవు ప్రకటించిన రోజుల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్కూల్స్ నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో బి.శేఖర్‌సింగ్ పేర్కొన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం పట్టణ, మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలు ప్రభుత్వ, విద్యాశాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థులకు సృజనాత్మకతో కూడిన విద్యను అందించాలని, ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై ఉందని తెలిపారు. సమావేశంలో ఎంఈవో-2 బాలాజీ, పట్టణ, మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్‌ల, సీఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులను కాపాడిన రైల్వే టీటీఈలు





బోల్తాపడ్డ బస్సు నుంచి వృద్ధులను బయటకు తీసుకొస్తున్న రైల్వే టీటీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వారిద్దరు విజయవాడ డివిజన్ ఒంగోలుకు చెందిన రైల్వే టీటీఐలు.. తెల్లవారుజామున విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు.. వారి ముందు ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. చుట్టూ చీకటి.. సమీపంలో ఏఒక్కరూ లేరు.. ఆయిల్ ట్యాంక్ లీక్ అయ్యి రోడ్డు అంతా చమురుతో నిండిపోయింది. బస్సులో నుంచి ప్రయాణికుల ఆర్తనాదాలు.. క్షణాల్లో స్పందించిన టీటీలు బస్సు అద్దాలు పగులకొట్టి లోపలికి వెళ్లి గాయపడ్డ వృద్ధులు, మహిళలు, పిల్లలను బయటకు తీసి తీవ్ర గాయాలతో ఉన్న వారిని 108 ద్వారా సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్య సేవలు అందటంతో ప్రయాణికులందరూ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో సకాలంలో స్పందించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన రైల్వే టీటీలపై ప్రయాణికులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున టంగుటూరు వద్ద జరిగింది. ఒంగోలులో టీటీఈలుగా విధులు నిర్వర్తిస్తున్న బీవీఎస్ తేజ, ఆర్.సుధీర్‌లు తమ విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వారి ముందు కడప నుంచి షిర్డీకి యాత్రికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టంగుటూరు సమీపంలోని సూరారెడ్డిపాలెం వద్దకు రాగానే డ్రైవరు నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొట్టడంతో బస్సు బొల్తా పడింది. వెంటనే స్పందించిన రైల్వే టీటీఈలు బస్సు అద్దాలు పగులకొట్టి లోపలికి వెళ్లి గాయపడ్డ వృద్ధులు, పిల్లలు, మహిళలను కిటికీ నుంచి బయటకు తరలించారు. 108కి సమాచారం అందించడంతో వారు క్షణాల్లో చేరుకుని, అక్కడకు చేరుకున్న సానికుల సాయంతో బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో గాయాలు తప్ప ఎటువంటి ప్రాణ నష్టం కలుగలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి తమ వంతు బాధ్యతగా బాధితులను కాపాడి వారి ప్రాణాలను కాపాడిన రైల్వే టీటీలను ప్రయాణికులతో పాటు స్థానికులు ప్రశంసించారు. తమ కళ్లముందు జరిగిన ప్రమాదంపై సకాలంలో స్పందించి వారి ప్రానాలను కాపాడటంలో విశేషంగా కృషిచేసిన టీటీలను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ దానిని పరిరక్షించేందుకు బాధ్యతగా వ్యవహరిస్తామని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం కళాశాల ఆడిటోరియంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం రచించడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశిష్ట పాత్ర పోషించారని అన్నారు. మన రాజ్యాంగం ఎంతో గొప్పదని, దానిని ప్రతి విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, కల్చరల్ విభాగాధిపతి ఎన్.ముత్యాలు, కంప్యూటర్ విభాగాధిపతి గంజి వెంకటరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణ మృతి

కొమరవోలు(పామర్రు): మండలంలోని కొమరవోలు గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొరిపర్తి కృష్ణ (90) ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం కృష్ణపార్థివ దేహాన్ని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ సందర్శించారు. పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కృష్ణ చేసిన సేవలు మరువ లేనివన్నారు. 2000 సంవత్సరంలో కొమరవోలు ఎంపీటీసీ స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారని అన్నారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)కి అత్యంత ఆప్తునిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తుచేశారు. స్థానిక పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అనుచరుడిగా ఉన్నారన్నారు. కృష్ణ మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణ అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో ప్రతిభ

గుడివాడ టౌన్: టాటా కన్సెల్టెన్సీ, టాటా ఐరన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యాలయ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించినట్లు డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తెలిపారు. ఈనెల 25వ తేదీన నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో మెట్టా కార్తీక్ బంగారు, ఎం.రిషితారెడ్డి వెండి, గుడివాడ హదస్సా వెండి పతకాలు, జూనియర్ విభాగంలో మెట్టా లిఖిత బంగారు, మూడెడ్ల పూర్ణశ్రీ పునీత్ వెండి, అన్నం పార్థు వెండి పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన గుడ్లవల్లేరు ఎస్ఐ



ఎస్పీ జాషువాకు మొక్కను అందజేస్తున్న ఎస్ఐ

కోనేరుసెంటర్: గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జి.సత్యనారాయణ సోమవారం జిల్లా ఎస్పీ పి.జాషువాను మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు.బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను ఎస్పీ అభినందించారు. విధులను బాధ్యతతో నిర్వర్తించాలని, ఎలాంటి ఆరోపణలు పోలీసులపై రాకుండా బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అందించేందుకు కృషి చేయాలని ఈసందర్భంగా ఎస్పీ సత్యనారాయణకు సూచించారు.

స్పందనకు ఐదు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వివరించారు. స్థానిక 1వ వార్డుకు చెందిన ఎం.శ్రీనివాసరావు వారి ఇళ్లకు వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురైందని, తొలగించాలని, స్థానిక 28వ వార్డుకు చెందిన లంకపల్లి ప్రియనాథుడు ఇందిరానగర్ కాలనీ పేరుతో ఉన్న బోర్డును తొలగించారని, దానిని పునఃనిర్మించాలని, స్థానిక 6వ వార్డుకు చెందిన ఏపీ లక్ష్మి మా ప్రాంతంలో ఖాళీస్థలాలు ఆక్రమిస్తున్నారని, స్థానిక బొమ్ములూరుకు చెందిన సోనియారాణి వెలుగుమిత్రలో తొలగించిన పేరును తిరిగి చేర్చాలని, 30వ వార్డుకు చెందిన సీహెచ్ సునీల ఇంటి స్థలం ఇప్పించాలని దరఖాస్తు చేసినట్లు ఆయన వివరించారు.

సెలవుపై వెళ్లిన జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ వ్యక్తిగత కారణాల నిమిత్తం వారం రోజులు సెలవు పెట్టారు.

కొల్లేరు గ్రామాలకు కొత్త కళ


సర్కారు కాల్వపై పూర్తయిన వారధి నిర్మాణం


పెద్దింట్లమ్మ దేవస్థానం పెద్ద అనివేటి మండపం

- సర్కారు కాల్వపై వారధి నిర్మాణం పూర్తి
- పెద్దింట్లమ్మ దేవాలయం వద్ద అనివేటి మండపం
- ఎమ్మెల్సీగా జయమంగళ రాకతో ప్రజల హర్షం
- కొల్లేరు కట్టుబాట్లకు ఇక చెల్లు

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో కొత్త కళ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు కొల్లేరు ప్రజల జీవన స్థితిగతుల్లో పెనుమార్పులు తీసుకొస్తున్నాయి. ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కొల్లేరు ప్రాంత వ్యక్తికి ఎమ్మెల్సీగా సీఎం జగన్ అవకాశం కల్పించారు. అధికారంలోకి రాగానే ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను అందించారు. సముద్రపు ఉప్పునీరు కొల్లేరు చేరకుండా, సరస్సులో నీరు ఎప్పుడూ నిల్వ ఉండేలా రెగ్యులేటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడంతో కొల్లేరు ప్రజలు వైఎస్సార్ సీపీని ఆశీర్వదిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సీఎం జగన్ ఆదేశాలతో కొల్లేరు ప్రజల దశాబ్దాల కల వారిధి నిర్మాణాన్ని పూర్తి చేశారు.

బాహ్య ప్రపంచంతో అనుసంధానం..

సర్కారు కాల్వపై వారధి నిర్మాణానికి 2009లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.12 కోట్లు కేటాయించారు. ఆయన ఆకస్మిక మరణంతో నిర్మాణం నిలిచింది. గత ప్రభుత్వం రూ.14.70 కోట్లు కేటాయించింది. అరకొర పనులు జరిగాయి. తీసుకొచ్చిన ఇనుము సైతం తుప్పు పట్టింది. నేడు సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ, స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కృషితో గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.5 కోట్లను విడుదల చేశారు. ప్రస్తుతం పనులు పూర్తయ్యి వంతెనపై వాహనాలు తిరుగుతున్నాయి. వంతెన నిర్మాణంతో పెద్దింట్లమ్మ దేవస్థానం మీదుగా ఏలూరు తక్కువ దూరంలో చేరుకోవచ్చు. ఉదాహరణకు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి బస్సులో జిల్లా ప్రధాన కేంద్రం ఏలూరు చేరాలంటే కైకలూరు మీదుగా 40 కిలోమీటర్లు దూరం ఉంది. అదే సర్కారు కాల్వపై వారధి నుంచి కొల్లేటికోట మీదుగా ఏలూరు చేరితే 10 కిలోమీటర్లే.

అద్భుతం అనివేటి మండపం..

వేంగి చాళుక్యుల కాలంలో కొల్లేటి పెద్దింట్లమ్మ దేవస్థానం నిర్మించారు. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు అమ్మను దర్శించుకుంటారు. దేవస్థానం ఎదురుగా భక్తులు బారులు తీరాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఎమ్మెల్యే డీఎన్నార్ దాతల సాయం రూ.4.50 కోట్లతో అనివేటి మండపాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా 105 అడుగుల వెడల్పు, 305 అడుగుల పొడవుతో 36 దేవతా విగ్రహాలతో మండపాన్ని నిర్మిస్తున్నారు. ఒక పక్క అమ్మవారి దేవస్థానం చేరడానికి వంతెన, మరో పక్క అతిపెద్ద అనివేటి మండపం నిర్మాణం కావడంతో కొల్లేరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కట్టుబాట్లకు చెల్లు చీటీ..

పూర్వం కొల్లేరు గ్రామాల్లో పెద్దలు చెప్పిందే తీర్పు. ప్రభుత్వానికి సమాంతర పాలన సాగేది. నేడు కొల్లేరు గ్రామాల్లో పూర్తిగా మార్పు వచ్చింది. గ్రామ ప్రజలకు అన్యాయం జరిగితే నేరుగా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాలు, వివిధ పథకాల ద్వారా అందుతున్న చేయూత ద్వారా మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నారు. మరో వైపు తమ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంతో కొల్లేరు ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉంటారని చెబుతున్నారు.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం..



సర్కారు కాల్వపై వారధి నిర్మాణం మా దశాబ్దాల కల. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే డీఎన్నార్ వంతెన పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలోని అన్ని కొల్లేటి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొల్లేరు ఆపరేషన్ సమయంలో అదనంగా ధ్వంసం చేసిన కొల్లేరు భూములను స్థానిక పేదలకు పంపిణీ చేయాలి.

–జయమంగళ కాసులు, సర్పంచ్, పెంచికలమర్రు, కైకలూరు మండలం

అనివేటి మండపం అద్భుతం..



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద నిర్మిస్తున్న అనివేటి మండపం అద్భుతంగా ఉంది. ఎమ్మెల్యే డీఎన్నార్ కృషితో నిర్మాణం జరుగుతోంది. పెద్ద ఎత్తున దాతలు సామగ్రి రూపంలో విరాళాలు అందించారు. వారధి నిర్మాణం పూర్తవడంతో పెద్దింట్లమ్మ దేవస్థానానికి చేరే భక్తులు సంఖ్య పెరుగుతోంది.

–కందుల వేణుగోపాలరావు, ఈవో, పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించిన కూరగాయలను విక్రయించారు. మునగ, అరటి, బెండ, పాలకూర తదితర కూరగాయలు, విత్తనాలు విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా కేవలం ప్రకృతి సిద్ధమైన వాటితో పండించిన కూరగాయలతో ఏ విధమైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావని తెలిపారు. మండల ఇన్‌చార్జి నాగ విజయ, నళిని పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మా వారోత్సవాలు



గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు వీవీఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ కళాశాలలో జరిగిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈనెల 20వ తేదీన ప్రారంభమైన 62వ జాతీయ వార్షికోత్సవాలు నిర్విరామంగా కొనసాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కేఎస్ నటరాజన్ మాట్లాడుతూ ఫార్మావిద్య ఒక కోర్సు మాత్రమే కాదని, సేవా దృక్పథంతో కూడిన ఒక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

నలుగురు అధ్యాపకులకు పీహెచ్ డీ



గుడ్లవల్లేరు : ఎస్ఆర్‌జీఈసీ గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు అధ్యాపకులు వివిధ యూనివర్సిటీల నుంచి పీహెచ్‌డీ డిగ్రీలు పొందినట్లు ప్రిన్సిపాల్ జీవీఎస్ఎస్ఆర్‌వీ ప్రసాద్ తెలిపారు. సోమవారం కళాశాల యాజమాన్యం పీహెచ్‌డీ పొందిన అధ్యాపకులను అభినందించారు. కళాశాల అధ్యాపకులు ఎ.అమరేంద్ర జేఎన్‌టీయూ కాకినాడ నుంచి, జి. రవీంద్ర అన్నామలై యూనివర్సిటీ నుంచి, ఎస్.అరుణచైతన్య జేఎన్‌టీయూ అనంతపూర్ నుంచి, జి.వెంకట జగదీష్ ఎన్ఐటీ రాయపూర్ నుంచి ఈ పట్టాలు పొందినట్లు ఆయన వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ పి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్ శాస్త్రి, బి.కరుణకుమార్, పి.రవీంద్రబాబు, ఎ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం


పూజాద్రవ్యాలు హోమంలో వేస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం చండీహోమం నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి అరుణాసారిక పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొన్నారు. గుడ్లవల్లేరు ఎస్ఐ పీవీవీ సత్యనారాయణ, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి దంపతులు, సభ్యులు పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, ఆలయ ఈఓ కానూరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో జ్యోతిర్లింగార్చన


దత్తాశ్రమంలో జ్యోతిర్లింగార్చన దృశ్యం

మండవల్లి: శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ఆశీస్సులతో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ దురజాడ ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవం, జ్యోతిర్లింగార్చన, రుద్రాభిషేకం కన్నులపండువగా జరిగాయి. అనంతరం కార్తిక సమారాధన నిర్వహించారు. కార్తిక సమరాధనలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వివాహం చేసుకున్న ఎమ్మెల్సీ జయమంగళ


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సాక్షి సంతకం చేసి పత్రాన్ని అందిస్తున్న రెండో భార్య సునీత

కైకలూరు: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఓ ఇంటి వారయ్యారు. ఏలూరు జిల్లా కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏలూరు అటవీ శాఖలో సెక్షన్ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న సుజాతను సోమవారం వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి సాక్షి సంతకాన్ని విడాకులు తీసుకున్న రెండో భార్య సునీత చేశారు. కొట్టాడ గ్రామానికి చెందిన జయమంగళ వెంకటరమణ జెడ్పీటీసీ సభ్యుడిగా, టీడీపీ ఎమ్మెల్యేగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన 1994లో కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన ఘంటసాల నాగమణిని వివాహం చేసుకున్నారు. 1997లో ఆమె మృతి చెందారు. తర్వాత మోరు సునీతను వివాహం చేసుకున్నారు. జయమంగళకు పూజిత, రమ్య, తేజ అనే ముగ్గురు సంతానం ఉన్నారు. సునీత, జయమంగళ మధ్య విభేదాలు రావడంతో ఐదేళ్ల క్రితం కోర్టు నుంచి విడాకులు తీసుకున్నారు. భీమడోలు మండలానికి చెందిన సునీతను సోమవారం వివాహం చేసుకున్నారు. కైకలూరు సబ్ రిజిస్ట్రార్ దుర్గారాణి వివాహ నమోదు పత్రాన్ని ఎమ్మెల్సీ దంపతులకు అందించారు. సుజాతకు ఇంతకుముందే వివాహం కాగా, ఆమెకు కుమారుడు ఉన్నాడు. ఆమె మొదటి భర్త నుంచి విడాకులు పొందారు. జయమంగళ రెండో భార్య కుమారుడు తేజ, కొద్దిమంది సన్నిహితులు వివాహానికి హాజరయ్యారు.

బాస్కెట్‌బాల్ పోటీలో ప్రతిభ


కీర్తన చత్రియను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీల్లో కేకేఆర్ గౌతమ్ పాఠశాల విద్యార్థి కె.కీర్తన చత్రియ వెండి పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. సోమవారం కీర్తన చత్రియను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యార్థిని ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిందని తెలిపారు. కీర్తన చత్రియను, కోచ్ మడకా సత్యాన్వేషలను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబ్రీనాలు అభినందించారు.